## క్లుప్తంగా

### టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు

**వేముల :** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 36 మంది విద్యార్థినులకు శ్రీగాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు వీలుగా స్టడీ మెటీరియల్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ శారద, ట్రస్ట్ కార్యదర్శి మధు, ఉప కార్యదర్శి శివానందరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**చెన్నూరు :** శ్రీ వెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో కేఎస్‌ఆర్ హాస్పిటల్ వారి సహకారంతో చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ శిబిరంలో డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బీపీ, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, పక్షవాతం, కామెర్లు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే డాక్టర్ విజయలక్ష్మి మహిళలకు సంబంధించి గర్భిణులకు వైద్య పరీక్షలు, హై రిస్క్ ప్రెగ్నెన్సీ, ట్యుబెక్టమి ఆపరేషన్లు, సంతాన సాఫల్యం, గర్భకోశ సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### రాచిన్నాయపల్లెలో గ్రావెల్‌రోడ్డు పనులు

**చెన్నూరు :** మండలంలోని రాచిన్నాయపల్లె నుంచి ఖాదర్‌ఖాన్‌కొట్టాల వరకు 500 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాసీమ బాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సొంటం నారాయణరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ జడ్పీ నిధుల నుంచి దాదాపు 500 మీటర్ల వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతో అటు రైతులకు, ఇటు ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలమేరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్, బాలుడు, నాగరాజులు పాల్గొన్నారు.

### రైతులు భూ రీసర్వేని సద్వినియోగం చేసుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, తదితరులు

**సింహాద్రిపురం :** రైతులు శాశ్వత భూహక్కు.. భూరక్షణ పథకం ద్వారా చేపట్టే భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లె, హిమకుంట్ల గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రైతులకు భూ సర్వే చేయించుకోవడానికి నోటీసులు అందజేయడం జరుగుతుందని.. రైతులకు ఇచ్చిన ఆ తేదీలలో తమ తమ హద్దులతోపాటు ఆధారాలను చూపించి భూ రీసర్వే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ కిశోర్‌రెడ్డి, మండల సర్వేయర్ రాజు, గ్రామ సర్వేయర్ మధు, వీఆర్‌ఓలు ఫణిందర్, నిరంజన్, రైతులు పాల్గొన్నారు.

### భాగవత పఠనం


ఆలయంలో భాగవత పఠనం చేస్తున్న సభ్యులు

**వేముల :** వేములలోని తిరుమలనాయుని గుట్టపై వెలసిన శ్రీమంజునాథేశ్వరస్వామి ఆలయంలో భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత పఠనం చేస్తున్నట్లు సభ్యులు వెంకటశేషయ్య తెలిపారు. ఆలయంలో శుక్రవారం నుంచి ఈనెల 16వ తేదీ గురువారం వరకు భాగవత సప్తాహ పఠనం, శ్రవణ యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. భాగవత భక్త సమాజం అధ్యక్షుడు బయపురెడ్డి, కోశాధికారి గంగిరెడ్డి, సలహాదారుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పఠనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భాగవత పఠనం ఉంటుందని భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# రంగరంగ పతే రంగనాథ..

- వైభవంగా శ్రీరంగనాథస్వామి కల్యాణం
- రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనం
- నేడు బ్రహ్మరథోత్సవం

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వైభోగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సతీసమేతుడైన శ్రీరంగనాథుని ముగ్ధమోహన రూపాన్ని చూసి భక్తులు తరించారు. స్వామి కల్యాణాన్ని జరిపించే పురోహితులు మంగళసూత్రాలను భక్తులకు చూపించి స్వామివారి చేతికి తాకించి అమ్మవార్ల మెడలో వేశారు. శాశ్వత కల్యాణ ఉభయదారులు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన చల్లా నారాయణస్వామి, ఉమాదేవి కుటుంబ సభ్యులచే కళ్యాణం జరిపించారు. శుక్రవారం సాయంత్రం స్వామివారు సతీ సమేతుడై గజ వాహనంపై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయకర్పూరాలను సమర్పించారు.

**నేడు బ్రహ్మరథోత్సవం :** బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు శనివారం ఉదయం రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం (తేరు)నిర్వహించనున్నారు. తిరుణాలను తిలకించేందుకు జిల్లా నుండేకాకుండా ఇతర జిల్లాలనుంచి భక్తులు తరలిరానున్నారు. బ్రహ్మర థం ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షిస్తున్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తాదులు (ఇన్‌సెట్) మంగళస్వరూపునిగా సతీసమేత శ్రీరంగనాథుడు

# స్నేహితుడి జ్ఞాపకార్థం వాటర్ ప్లాంటు ఏర్పాటు


మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎస్‌ఐ విష్ణువర్ధన్

**వల్లూరు :** తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు మృతి చెందడంతో స్నేహితుడి జ్ఞాపకార్థం చదువుకున్న పాఠశాలలో తోటి స్నేహితులు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వివరాల్లోకెళితే.. వల్లూరు మండలంలోని పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న బ్యాచ్‌కు చెందిన ఆవలూరి గోవర్ధన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని తోటిస్నేహితులు అతని జ్ఞాపకార్థం తాము చదువుకున్న పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును రూ. ఒక లక్షా 20 వేలు వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటును ఎస్‌ఐ విష్ణు వర్ధన్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మృతి చెందిన స్నేహితుడి కోసం మిత్రులందరూ కలిసి వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మిత్రులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కడపకు చెందిన బోగా పార్వతమ్మ ట్రస్ట్ వారు వితరణగా అందచేసిన చదువుల తల్లి శ్రీ సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి మిత్రులు ప్రహ్లాద, రామయ్య, సురేష్, మురళి, శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివకృష్ణ, రామకృష్ణ, వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పులివెందుల రూరల్ :** శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఊరేగింపు సందర్భంగా పట్టణంలోని అమ్మవారిశాల వీధి, మిస్సమ్మ బంగ్లా, పాత గంగిరెడ్డి ఆసుపత్రి వీధి, పూలంగళ్ల సర్కిల్, మెయిన్ రోడ్డు, బాలికల ఉన్నత పాఠశాల బజార్ తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. అలాగే 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పెద్ద రంగాపురం, కొత్తపల్లె, సరస్వతి మైన్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని వారు కోరారు.

**జమ్మలమడుగు..**

**జమ్మలమడుగు రూరల్ :** నియోజకవర్గంలోని జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూర్, కొండాపురం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జమ్మలమడుగు ట్రాన్స్‌కో ఏడీ వై.శేషగిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో ఉంచుకుని ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది కలుగకుండా సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# రేపు వైద్య నిపుణులు రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి) లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్‌ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల తనిఖీ

**చెన్నూరు :** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ పఠాన్ అలీఖాన్ తనిఖీ చేశారు. మండల పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి పోలింగ్ నిర్వహణపై చర్చించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తూర్పు దిక్కున పట్టభద్రులకు సంబంధించిన 19వ పోలింగ్ బూత్, పడమర వైపున టీచర్స్‌కు సంబంధించిన 18వ పోలింగ్ బూత్‌ను ఏర్పాటుపై పరిశీలించామన్నారు. అలాగే ఫర్నీచర్, లైటింగ్, నీటి వసతులకు సంబంధించి పలు అంశాలను ఆయన ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డితో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలుపై తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో, కార్యదర్శులతో సమావేశం నిర్వహించామన్నారు. కాగా ఇప్పటివరకు 1103 మంది పట్టభద్రులకు సంబంధించి ఓటుహక్కు కోసం నమోదు అయ్యారని, ఉపాధ్యాయులకు సంబంధించి 67 మందిని ఎన్‌రోల్ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారు ఎన్‌రోల్ చేయాలనుకుంటే ఎన్నికలకు పది రోజుల ముందు వరకు కూడా నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రభుత్వ కార్యాలయాల్లో నిబంధనల మేరకు అక్కడున్న ఫొటోలు, జన్మదిన శుభకాంక్షలు, పండుగ శుభాకాంక్షలు తెలిపే బ్యానర్లు, పోస్టర్లు వంటి వాటిని తొలగించడం, విగ్రహాలకు ముసుగు వేయడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**ఎర్రగుంట్ల :** పట్టణంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్‌రహీం ఆరోగ్య రీత్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలతో కలసి అబ్దుల్ రహీంను పరామర్శించారు.

### పంట కోత ప్రయోగాలు


పెసరలో పంటకోత ప్రయోగాలు చేస్తున్న ఏఓ

**వేంపల్లె :** మండల పరిధిలోని తాళ్లపల్లె గ్రామంలో శుక్రవారం పెసరలో పంట కోత ప్రయోగాలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏఐసీ కంపెనీ రీజినల్ మేనేజర్ శివశంకర్‌మూర్తి, పరిపాలనాధికారి బాలస్వామిలతో కలిసి ఆయన పంట కోత ప్రయోగాలలో పాల్గొని పంట దిగుబడులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆదిమూలపు ప్రసాద్ అనే రైతుకు చెందిన 1.70 ఎకరాల పెసర పంటలో పంటకోత పరయోగం చేయగా.. 28 కిలోల దిగుబడి వచ్చిందని తెలిపారు. పంటకోత ప్రయోగాలు చేయడంవల్ల దిగుబడిని అంచనా వేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు శ్వేత, దాసు, శివ, రైతులు పాల్గొన్నారు.

### రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

**పెండ్లిమర్రి :** రైతు భరోసా కేంద్రాలల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు ఉన్నాయా లేదా అని అరాతీశారు. పంట నమోదు, ఈకేవైసీ తప్పని సరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిని బ్లెస్సీ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ఎర్రగుంట్ల :** టీచర్స్, పట్ట భద్రుల ఎన్నికలకు సంబంధించి పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ నందు ఒక్కొక్క కేంద్రం, అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### రాష్ట్రానికి నిధులు తగ్గించడంపై సీపీఐ నిరసన

**ఎర్రగుంట్ల :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధు లు తగ్గించడంపై వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయమైన పోస్ట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# సైన్స్‌ఫేర్ విజయవంతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

**పులివెందుల రూరల్ :** సైన్స్‌ఫేర్ విజయవంతనాకి అందరూ కృషి చేయాలని డీఈఓ దేవరాజు విద్యా కమిటీలకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి అధ్యక్షతన సైన్స్‌ఫేర్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యాపరంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఈనెల 13,14వ తేదీల్లో అహోబిలాపురం ప్రభుత్వ మెయిన్ స్కూల్‌లో జరిగే జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయడంలో అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరారెడ్డి, పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇళ్లు, వాణిజ్య సముదాయాలు తొలగించుకోవాలి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

**వేంపల్లె :** ఈనెల 20వ తేదీలోపు ఇళ్లు, వాణిజ్య సముదాయాలు తొలగించుకోవాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేంపల్లె పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపరిహారం అందిన ఇళ్లు, వాణిజ్య సముదాయల లబ్ధిదారులందరూ అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. పట్టణంలో రూ.92 కోట్ల వ్యయంతో చేపట్టిన యూజీడీ పనులు ఎంత వేర జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాలలో విద్యుత్, మంచినీటి తదితర సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోడ్డు విస్తరణ పనులలో లబ్ధిదారులు ఈనెల 20వ తేదీలోపు తమ ఇళ్లు, వాణిజ్య సముదాయాలు తొలగించకపోతే ఆర్అండ్‌బీ అధికారులు వచ్చి తొలగిస్తారన్నారు. అంతేకాక జగనన్న కాలనీ లే అవుట్లలో విద్యుత్, నీటి వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, ఏఈ వెంకటరమణ, విద్యుత్ డీఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ హరిత

**జమ్మలమడుగు రూరల్ :** రానున్న వేసవికాలన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ఎంపీపీ గుద్దేటి హరిత తెలిపారు. శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయ సభ భవనంలో ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా అధికారులు చూడాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, కాల్వలను అధికారులు సత్వరమే పూర్తి చేయాలని, గ్రామాల్లో వ్యాధులు ప్రభలకుండా ఎప్పటికప్పుడు కాల్వల్లో ఉన్న పూడికలను తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఎంపీడీఓ పరిపూర్ణ అరుంధతి మాట్లాడుతూ అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చినా కొన్ని విభాగాలకు చెందిన అధికారులు హాజరుకాలేదని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# అదాని ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలి


పోస్టమాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

**కమలాపురం :** దివాళా తీస్తున్న అదాని ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోస్టాఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోస్టమాస్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ కారు చౌకగా అదానికి కట్టబెట్టడం సిగ్గుచేటని, ఇకనైనా ఆపాలన్నారు. దివాళా తీస్తున్న అదాని ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తక్షణం జప్తు చేయాలన్నారు. రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులతో పాటు నూతన పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్రం ముందుకు రాకపోవడం దారుణం అని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధిని విస్మరించడం హేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డయ్య, రామచంద్ర, హుసేన్‌లు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**వీరపునాయునిపల్లె :** మండలంలోని సంగాలపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి కుమారుని వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నూతన దంపతులు శివసాయిప్రసాద్‌రెడ్డి, విఘ్నేశ్వరిలను ఆశీర్వదించారు. అనంతరం సంగమేశ్వరాలయానికి చేరుకొన్న ఎమ్మెల్యేకి ఆలయ చైర్మన్ నర్రెడ్డి శివాంజనేయరెడ్డి, ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుందరేశ్వరస్వామి

**జమ్మలమడుగు రూరల్ :** మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్నెతీర్థంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సుందరేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరి హరనాథశర్మ ఉదయం స్వామి వారికి గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదములు అందజేశారు.

# కేసీ కెనాల్‌లో పూడిక తొలగించి సైడ్‌వాల్ నిర్మించాలి

**చెన్నూరు :** స్థానిక కొత్తరోడ్డు వద్ద ఉన్న కేసీ కెనాల్ వెంబడి సైడ్‌వాల్ దెబ్బతిని వ్యర్థాలతో, పిచ్చిమొక్కలతో కేసీ కెనాల్ పూడిపోవడం జరుగుతోందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేసీ కెనాల్ ఏఈ సుబ్బరాయుడుకు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం ప్రజల ఫిర్యాదు మేరకు ఎంపీపీ చెన్నూరు కొత్తరోడ్డువద్దగల కేసీ కెనాల్‌ను ఏఈ సుబ్బరాయుడు, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ ముదిరెడ్డిసుబ్బారెడ్డి, కార్యదర్శి రామసుబ్బారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పిచ్చిమొక్కలు, మరోవైపు వ్యర్థాలతో కాలువ పూడిపోతోందని, అలాగే వ్యర్థాలన్నీ కూడా వేయడం వల్ల అక్కడికి వచ్చే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కాలువ మరమ్మతులు పనులు చేపట్టాలని ఆయన కేసీ కెనాల్ అధికారులను కోరారు. ఇందుకు ఏఈ ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిచ్చయ్య, చంద్ర, సురతాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుపై ఏకాగ్రత ఎంతో అవసరం

**లింగాల :** చదువుతోపాటు ఏకాగ్రత ఎంతో అవసరమని.. ఏకాగ్రతవల్ల లక్ష్యాన్ని చేరుకోవచ్చునని ప్రముఖ వ్యాఖ్యాత శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రామచంద్రయ్య అధ్యక్షతన విద్యార్థులకు ×పరీక్షలలో మానసిక ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశంపై అవగాహన కల్పించి మాట్లాడారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఆధారపడి ఉందని.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ ఉన్నతమైన ఉన్నతాశయంతో పయనించాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన అంగన్‌వాడీ వర్కర్ల ఇంటర్వ్యూలు


అభ్యర్థినులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**జమ్మలమడుగు :** జమ్మలమడుగు, ముద్దనూర్, ప్రొద్దుటూర్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టులకు శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికైన అభ్యర్థులకు సమాచారం అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారిణిలు ముంతాజ్, రాజేశ్వరి, హైమావతి, తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### దాల్మియా కాలుష్యం వల్ల దెబ్బతింటున్న పొలాలు

**మైలవరం (జమ్మలమడుగు రూరల్) :** దాల్మియా కర్మాగారం నుంచి వస్తున్న కాలుష్యం వల్ల తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని దుగ్గనపల్లె గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కాలుష్యం వల్ల దెబ్బతింటున్న పంట పొలాలను, గ్రామాన్ని సందర్శించి పరిశీలించి రైతులకు, ప్రజలకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.